క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపాళెం, కొండవల్లిపాడు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు తప్పకుండా గ్రామసభలకు హాజరుకావాలన్నారు. అనంతరం మహిళలకు రాయితీ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. రైతులకు రాయితీపై డ్రోన్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మోహన్, ఏపీఎం నిర్మలమ్మ, ఏపీఓ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, వైద్యులు డానియల్ రాజు, సీహెచ్ఓ సుబ్బయ్య, సర్పంచ్ లలితమ్మ, ఆర్ఆర్‌హెచ్‌పీ గ్యాస్ నిర్వాకుడు సుబ్బరావు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కిట్ల అందజేత



రెండు చక్రాల బండి అందజేస్తున్న ఎంఈఓ

దక్కిలి: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు సీఆర్సీ రీజినల్ నెల్లూరు నుంచి సరఫరా చేసిన కిట్ -3, కిట్-4ను సోమవారం అందజేసినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -2 జగదీష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు, భవిత ఉపాధ్యాయులు బీ సౌమ్య, ఓ బాలమేరి పాల్గొన్నారు.

బాలికలకు ముగ్గులు, క్రీడా పోటీలు



బహుమతి అందజేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ మనోజ్

కోట: మంలంలోని కోట, చిట్టేడులోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు ఆటవిడుపుగా సోమవారం చిట్టేడు హైస్కూల్‌లో ముగ్గులు, క్రీడల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీలు పడి రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. రన్నింగ్, లెమన్ స్పూన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓ మనోజ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు ఉషారాణి, పద్మజ, మహేంద్ర పాల్గొన్నారు.


వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సూళ్లూరుపేట రూరల్: రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే వ్యవసాయాధికారుల సలహాలు తప్పని సరిగా పాటించాలని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం వనరుల కేంద్రం శాస్త్రవేత్తల బృందం సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు, దొరవారిసత్రం మండలంలోని ఉచ్చూరు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ, మిరప రైతులు సాగులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మంగళంపాడులో రైతులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అధికారులు శ్రీనివాసులు, వేణుగోపాల్, సూళ్లూరుపేట ఏడీఏ అనిత, ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

నాగార్పమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



రామ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నేతలు

వాకాడు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ పీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగార్పమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సుధాకర్‌రెడ్డి, భార్గవ్ రామ, రవి, పెంచలరెడ్డి, రామలింగారెడ్డి, శివారెడ్డి, జానీబాయ్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



దక్కిలి: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

దక్కిలి: బీఆర్ అంబేడ్కర్ భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, అన్ని వర్గాల ప్రజలకు ఆయన అండగా నిలిచారని ఎంపీడీఓ ప్రసన్న కుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈ నెల19వ తేదీన బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, వార్డుల్లో 18వ తేదీ వరకు పండుగలా జన్ భాగీదారి కార్యక్రమం విస్తృతంగా నిర్వహించిన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.400 కోట్లు ఖర్చు చేసి 20 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేసి, అందులో 125 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. షెడ్యూలు ప్రకారం ప్రతి సచివాలయంలో పెద్ద ఎత్తున జన్‌భాగీదారి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ అల్లాబక్ష్, సూపరిండెంటెంట్ అనురాధ, సీనియర్ సహయకులు సిరాజుద్దీన్ ఖాద్రి పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్‌కు నివాళి

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే సైదాపురం ఆస్పత్రి కూడలి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, సర్పంచ్ శారద, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరయ్య, ఏపీఎం రాధ, ఎంఈఓ దయాకర్ పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: మండల కేంద్రంలోని సోమవారం జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పాజీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, రైతు సంఘ సలహామండలి చైర్మన్ ఎస్ రవీంద్రారెడ్డి, సర్పంచ్ జయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాకాడులో అంబేడ్కర్‌కు నివాళి

వాకాడులో..

వాకాడు: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈ నెల 19వ తేదీన 125 అడుగుల స్మృతివనం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో సోమవారం వాకాడులో ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు కే దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం కావాలని కోరిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, అజిత్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరత్నం, మధురెడ్డి, మస్తానయ్య, శేఖర్, సుధాకర్‌నాయుడు,నాగరాజు,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అబేండ్కర్ సేవలు మరువలేనివి

వెంకటగిరిరూరల్: డాక్టర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని ఎంపీడీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగార్జున సాగర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలువాయిలో ర్యాలీ

కలువాయి: మండలకేంద్రంలో జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా అధికారులు, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి, ఎంపీడీఓ గోవర్ధన్, ఎంఈఓ శేషగిరి, ఏడీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ ప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం అబ్బాస్ అలీ పాల్గొన్నారు.



సైదాపురం: నివాళులర్పిస్తున్న అధికారులు



రాపూరులో..



వెంకటగిరి రూరల్: నివాళులర్పిస్తున్న అధికారులు



కలువాయిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

సీఎం జగన్‌తో నేదురుమల్లి భేటీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెంకటగిరి నియోజక వర్గ అభివృద్ధిపై చర్చించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

దొరవారిసత్రం: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘురామయ్య తెలిపారు. సచివాయం పరిధిలోని రోగులందరూ సురక్ష కార్యక్రమంలో పరీక్షలు చేయించుకుని, మందులు పొందాలని ఆయన కోరారు. సాధారణ రోగాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

హక్కులు కల్పించండి

చిల్లకూరు: మండలంలోని కడివేడులో ఉన్న ప్రభుత్వ భూములపై తమకు హక్కులు కల్పించాలని కమ్మవారిపాళెం దళితులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సెంటు భూమి కూడా లేదని, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టేటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



చిల్లకూరు: భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

చిల్లకూరు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో సోమవారం పలు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేశారు. విద్యార్థులు హరిదాసు వేషధారణలతో అలరించారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. రంగ వల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. చింతవరంలోని రేస్ పబ్లిక్ స్కూల్ బాల చెన్నయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కళ ఏర్పడుతుందని అన్నారు.

గూడూరులో..

గూడూరురూరల్ : మండలంలోని చెన్నూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి, గాలి పటాలు ఎగురవేసి కేరింతలు కొట్టారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలనాగమ్మ, ఉపాధ్యాయులు శ్రీవాణి, లోకేశ్వరి, జమీలా, ఇన్‌చార్జి హెచ్ఎం సందాని, రాజశేఖర్, శ్రీనివాసరావు, శంకరయ్య, గోపి, తదితరులు పాల్గొన్నారు. అలాగే విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకట నాగమల్లికార్జున, పాలిచెర్ల రాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కృష్ణంరాజు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు.



చెన్నూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు

కోడి పందేల స్థావరంపై దాడులు

సైదాపురం: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, పోతేగుంట గ్రామాల మధ్య నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సైదాపురం పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఆ సమయంలో పందెం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, మూడు కోళ్లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

వల్లివేడులో..

చిల్లకూరు: మండలంలోని వల్లిపేడు శివారులో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు కోడి పందేల స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, నాలుగు కోళ్లు, రూ.1400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సన్మానం



మోహన్‌రాజును సన్మానిస్తున్న ఉద్యోగులు

నాయుడుపేట: సాంఘిక సంక్షేమ సోషల్ వెల్ఫేర్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన కడూరు మోహన్‌రాజును సోమవారం నాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల యాజమాన్యం సన్మానించింది. స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మోహన్‌రాజును ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు గురుకులం ప్రిన్సిపల్ మల్లికార్జునరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, రవీంద్రబాబు, రాజశేఖర్, ఉపాధ్యాయులు బీ శేఖర్‌బాబు, సీ వెంకటకృష్ణయ్య, జె వెంకటరమణయ్య, కస్తూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కోట: షిరిడీ సాయిఅక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం కోట పంచాయతీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తమ సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు అందజేశామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట సర్పంచ్ వెంకటరమణమ్మ, కార్యదర్శి శ్రీనివాసులు, సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేదురుమల్లి జన్మదిన వేడుకలు



వెంకటగిరి రూరల్: బాలసదన్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సురేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి

వెంకటగిరిరూరల్/సైదాపురం/దక్కిలి/బాలాయపల్లె/వాకాడు/రాపూరు/కోట/వాకాడు/: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వెంకటగిరిరూరల్, సైదాపురం, దక్కిలి, బాలాయపల్లె, వాకాడు, రాపూరు, కోట, వాకాడు మండలాల్లో జరిగిన వేడుకల సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు పలు సేవా కార్యక్రమాలు చేశారు. వెంకటగిరి బాలసదన్‌లో విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, దుప్పట్లు పంపిణీ చేసి, చికెన్ బిర్యానీ అందజేశారు. సైదాపురంలో స్వీట్లు పంపి ణీ చేశారు. దక్కిలిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాలాయపల్లె మండలం వెంగమాంబపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల కు పరీక్ష సామగ్రి అందజేశారు. రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఎన్‌బీకేఆర్ కళాశాలలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కోట మండలం తిన్నెలపూడి సాయినగర్ గిరిజన కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు.



దక్కిలి:వెంగమాంబపురం హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న కార్తీక్‌రెడ్డి

కండలేరులో 12.882 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 12.882 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 160 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీ



దీవీసత్రం: బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్

దొరవారిసత్రం: మండలంలోని 11 సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారులకు సోమవారం ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు, సచివాలయం సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్ నగదు అందజేశారు. కొత్త పింఛన్లు 60 మంజూరు చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

చిల్లకూరు: నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు. మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామానికి చెందిన లెక్కల ఇందిరమ్మ అనారోగ్యంతో నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ నక్కా కిన్నెర భర్త గోపి నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.



చిల్లకూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

కులగణన పక్కాగా నిర్వహించాలి




మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటసూర్యసాయి

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి చేపడుతున్న కులగణన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటసూర్యసాయి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కుల గణన చేపడుతున్నందున పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ కులగణన చేసే సిబ్బందికి సహకారం అందించాలన్నారు. అలాగే త్వరలోనే ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉందని అందుకు తగిన ఏర్పాటు చేయాలని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి, ప్రజలకు మంచి ఆరోగ్యం అందించేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆయా పంచాయతీల్లోని ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు ప్రత్యామ్నాయం నానో యూరియా

కలువాయి: ఇఫ్‌కో వారి యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులు నానో యూరియాను వాడుకోవాలని ఏఓ ప్రతాప్ తెలిపారు. తెలుగురాయపురం రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఆయన గ్రామంలో సాగులో ఉన్న వరి, తదితర పంటలను పరిశీలించారు.



యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రతాప్

క్యాంపస్ సెలక్షన్లలో 70 మంది ఎంపిక



కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీలో అసెంచర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో 70 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో సీఎస్ఈ విభాగం నుంచి 35 మంది, ఈసీఈ విభాగం నుంచి 24 మంది, ఏఐఅండ్‌డీఎస్ నుంచి ఏడుగురు, ఐటీ నుంచి నలుగురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

నెరవేరిన వందేళ్ల కల

పెళ్లకూరు: పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట వాసుల వందేళ్ల కల నెరవేరింది. వివరాల్లోకి వెళితే పుల్లూరు-ముమ్మారెడ్డిగుంట గ్రామాల మధ్య సాగునీటి కాలువపై వంతెన లేకపోవడంతో అక్కడి ప్రజలు శతాబ్దం కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏటా వర్షాకాలంలో వరదనీటి ఉధృతి కారణంగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. తొట్టంబేడు మండలం కొణతనేరి గ్రామంలోని రెండు చెరువుల్లోని మిగులు నీరు వ్యవసాయ కాలువ ద్వారా పుల్లూరు చెరువుకు, అక్కడ నుంచి స్వర్ణముఖినదికి చేరుతాయి. ఏటా వర్షాకాలంలో రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించడంతో ఆ గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడేవారు. ఈ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సర్పంచ్ రాంబాబు ఈ సమస్యను ఎమ్మెల్యే సంజీవయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వంతెన నిర్మాణానికి రూ.56 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో వంతెన నిర్మాణం సకాలంలో పూర్తి చేయడంపై ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పుల్లూరు-ముమ్మారెడ్డిగుంట గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన వంతెన